క్లుప్తంగా

గంగాలమ్మ గుడికి విరాళం



మూలపేటలోని గంగాలమ్మ గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులంతా నూతన ఆలయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయ అభివృద్ధికి దాతల సహకారం కోరుతూ వచ్చింది. ఇప్పటికే పలువురు ఆలయ నిర్మాణానికి తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా స్వర్గీయ శరగడం చిన భాస్కరరావు భార్యకుమారి కుమారులు ఆశోక్, పైడిరాజు రూ.25116 నగదును నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. పీలా అప్పారావు కుమారులు మహేష్, గంగప్పారావు రూ.20వేల మేర సాయం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



గ్రామంలో ముగ్గుల పోటీలు

ఎస్.రాయవరం : మండలంలో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. పేటసూదిపురం గ్రామంలో గురువారం తీర్థ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేఘమాల భవాని ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. తీర్థంలో ఆట వస్తువులతో చిన్నారులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. తినుబండారు కొనుగోలు చేశారు. తీర్థానికి పరిసర ప్రాంతాల్లో సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, జేవీపాలెం తదితర గ్రామాల్లో తీర్థానికి తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

దిమిలిలో నగర సంకీర్తన



దిమిలిలో మేలుకొలుపు, నగర సంకీర్తనలో భక్తులు

రాంబిల్లి: దిమిలిలో మేలుకొలుపు, నగర సంకీర్తన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభం, సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకొని ఈ మేలుకొలుపు, నగర సంకీర్తన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బండి వారి వీధి భజన బృందం సభ్యురాలు నల్లమారి రాము తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు.

నేటి నుంచి కులగణన

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నుంచి కులగణన సర్వే కార్యక్రమం ప్రారంభించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు శుక్రవారం తెలిపారు. పురపాలక సంఘంలో 13 సచివాలయాల పరిధిలో 25 వార్డులున్నాయి. ఈ వార్డుల్లో శుక్రవారం నుంచి కులగణన ప్రారంభమౌతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 29 వరకూ సర్వే చేపడతామని ఆయన తెలిపారు. సర్వే సమయంలో ఇళ్లలో అందుబాటులో లేని వారు ఈ నెల 29 నుండి వచ్చే నెల 2వ తేదీ వరకూ సచివాలయాల్లో వివరాల నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలంతా నిర్ణీత సమయంలో కులగణన సర్వే పూర్తి చేయడానికి యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

సిద్ధమైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



సత్యవరంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

మాడుగుల : సత్యవరం గ్రామంలో సుమారు రూ. 20 లక్షలతో నిర్మించతలపెట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సర్వాంగ సుందరంగా తయారయింది. అతి త్వరలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దీనిని ప్రారంభించనున్నారని ఎంపీటీసీ సభ్యుడు తలారి అప్పారావు తెలిపారు. ఈ క్లినిక్ అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం అందుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర



కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తుల పూజలు



పట్టణ రహదారుల్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల విద్యుత్ దీపాలంకరణలు

- భారీగా తరలిరానున్న భక్తజనం
- పురవీధుల్లో ఆకట్టుకుంటున్న విద్యుత్ సెట్టింగ్‌లు
- భారీ బందోబస్త్ ఏర్పాట్లు

యలమంచిలి : పట్టణంలోని ధర్మవరంలో వెలసియున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది.ఏటా మార్గశిరమాసంలో నెల రోజుల పాటు ఇక్కడ కనకహాలక్ష్మి అమ్మవారికి మహిళలు, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి జనవరి 19న అమ్మవారి ఆలయం వద్ద ఉన్న రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అత్యంత వైభవంగా జాతర మహోత్సవం నిర్వహిస్తారు. ఈ జాతరలో అన్ని గృహోపకరణాలు,వివిధ . వస్తువులు,సరుకులు ప్రజలకు అందుబాటులో దొరుకుతాయి. వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని జాతరను తిలకిస్తారు. రాజీవ్ క్రీడా మైదానంలో ఇప్పటికే రంగుల రాట్నాలు, జెయింట్‌వీల్స్, జారుడుబల్లలు, పిల్లలు ఊగే ఉయ్యాలలు ఏర్పాటు చేశారు. పట్టణ వీధుల్లో వివిధ రకాల దేవతామూర్తుల విగ్రహాలతో కూడిన విద్యుద్దీపాలంకరణలు చేశారు. సీఐ షేక్ గపూర్, పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా నియంత్రించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారి దర్శనానికి ప్రజాప్రతినిధులు తరలిరానున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సాముగరిడీలు, చెట్టుభజనలు, మహిళల కోలాటాలు, నేలవేషాలు, నృత్యప్రదర్శనలు, భారీ మందుగుండు సామాగ్రిని ఏర్పాటు చేశారు.

విశాఖ డెయిరీ అభివృద్ధికి తోడ్పడండి



పాడి రైతులకు దుప్పట్లు అందిస్తున్న సంఘ మాజీ అధ్యక్షుడు ప్రసాద్

కోటవురట్ల : పాడి రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తున్న విశాఖ డెయిరీ అభివృద్ధికి రైతులు సహకారం అందించాలని సంఘ అధ్యక్షురాలు సూరిశెట్టి సత్యవతి కోరారు. రాజుపేట విశాఖ డెయిరీ సంఘ కార్యాలయం వద్ద పాడి రైతులకు సంక్రాంతి బోనస్ అందజేశారు. అనంతరం పాడి రైతులకు పశువైద్యాధికారి డాక్టర్ సూరిశెట్టి జగదీష్ సహకారంతో దుప్పట్లు అందజేశారు. లేగదూడల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉత్తమ లేగ దూడల పోటీ నిర్వహించి రైతులకు బహుమతులు అందజేశారు. సత్యవతి మాట్లాడుతూ రాజుపేట రైతులు డెయిరీ అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటారని కితాబునిచ్చారు. 180 మంది రైతులకు బోనస్‌గా రూ.3.25 లక్షలు అందించినట్టు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకు 14 మంది రైతులకు రూ.8.40 లక్షలు సొసైటీ ద్వారా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ జయలక్ష్మి, పాటిపల్లి సర్పంచ్ కృష్ణవేణి

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. పాటిపల్లి సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆమె గురువారం ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించేలా క్రీడాకారులు సాధన చేయాలన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఉప సర్పంచ్ గంగు నాయుడు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పీఈటీ రవిశంకర్, సచివాలయ కన్వీనర్ భీశెట్టి ధనశ్రీను, పార్టీ నాయకులు ప్రకాష్, సంజయ్, సచివాలయ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాగా పోటీలను తిలకించేందుకు పలువురు క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా ఎన్టీఆర్‌కు నివాళులు



మునగపాకలో ఎన్టీఆర్‌కు నివాళి

మునగపాక : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయ సాధనకు పాటుపడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కోరారు. మాజీ ముఖ్యమంత్రి రామారావు వర్ధంతి కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మునగపాకలో పార్టీ సీనియర్ నాయకులు ఆడారి కన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడారు.

కోటవురట్ల : జల్లూరులో దివంగత సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అనిత, టీడీపీ నేత చింతకాయల విజయ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నేతలు లాలం కాశీనాయుడు, జానకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక కావాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక తప్పనిసరని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు సమన్వయంగా అభివృద్ధికి ప్రణాళిక చేయాలన్నారు. ఆయా పంచాయతీలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ భానోజీరావు, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

పెదపాడు రామాలయంలో భరతమాతకు పూజలు



భరతమాత చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని పెదపాడు రామాయలంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం భరతమాతకు పూజలు నిర్వహించారు. యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి రమణ, ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావులు మాట్లాడుతూ భరత మాత ఒడిలోనే సంస్కృతి సంప్రదాయాలు,ఉపనిషత్తులు వెలిసాయని తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠను వీక్షించాలని, ప్రతి ఇంట ఐదు దీపాలు వెలించాలని సూచించారు. కార్యక్రమంలో జనపరెడ్డి వెంకట శ్రీనివాసరావు, కృష్ణారావు, ద్వారపురెడ్డి చిలకమ్మ పాల్గొన్నారు.

హైవే కూడలిలో సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు సన్నాహాలు

సీఐ వినోద్‌బాబు



కశింకోట : కశింకోట కూడలిలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల రద్దీ వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. దీని నివారణకు రాజమహేంద్రవరంలోని జాతీయ రహదారి పీడీ దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ కూడలి వెడల్పు చేసి సిగ్నల్ లైట్లు, రోడ్డుపై లైటింగ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈలోగా స్టాప్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ పండగలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందాలు, పేకాట, గుండాటలు ఆడరాదన్నారు. స్టేజి కార్యక్రమాలకు మైక్ ఏర్పాటు చేయడానికి డీఎస్పీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇళ్లు విడిచి దూరం ప్రయాణాలకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల ఇళ్ల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల విసన్నపేటలో చెక్కా కుమారి ఇంట్లో జరిగిన బంగారం దొంగతనం కేసును, బయ్యవరంలో బరుకు గోవింద్ హత్య కేసును ఒక రోజులోనే ఛేదించగలిగామని, ఇందుకు ఉన్నతాధికారుల ప్రోత్సాహం, ప్రజలు, సిబ్బంది సహకారంతో సాధించగలిగామన్నారు. ఇకపై కూడా నేరాల నియంత్రణకు ప్రజలు తమ సహకారం అందించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు గురువారం కలుసుకుని సందడి చేశారు. 2010-11 సంవత్సరాల్లో 10 వ తరగతి చదువుకున్న విద్యార్థులు 13 ఏళ్ల తరువాత కటుంబ సమేతంగా కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపి ఆనందించారు.దీంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

మాకవరపాలెం : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో ఏయే పనులు చేసుకోవాలి, వాటికి ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో చిరంజీవి, ఎంఈవో మూర్తి, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతోనే అభివృద్ధి

నర్సీపట్నం: అభివృద్ధికి సంబంధించి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధికారులకు సూచించారు. గ్రామ, బ్లాక్ పంచాయతీల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక రూపొందించటంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, గ్రామ, మండల స్థాయి అధికారులతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రామాణికంగా తీసుకుని ఆ నిధులతో ఏయే పనులు చేపట్టాలనే దానిపై సమగ్ర ప్రణాళిక తయారు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయమాధవి, వైస్‌ఎంపీపీ తాతబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుకు డిమాండ్

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక న్యాయసముదాయం ముందు గురువారం న్యాయవాదలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా న్యాయవాది సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు ఎం.జి.వి.ఎస్ కుమార్, బొడ్డేడ రాజగోపాల్ సందర్శించి న్యాయవాదులకు మద్దతు తెలియజేశారు.

నేడు ఆర్. భీమవరంలో ఎడ్ల పందాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఆర్. భీమవరంలో శుక్రవారం సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఉట్టికొట్టు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిపొందిన విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. తీర్థ మహోత్సవంలో తప్పెటగుళ్లు, తోడపెద్దు భజన, మహిళల కోలాటం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ

అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయంలో గురువారం శ్రీ వినాయక గౌరీ సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు 300 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని పేదలకు వస్త్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ కొండలరావు



వికసిత్ భారత్ సంకల్ప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు, ప్రజాప్రతినిధులు

యలమంచిలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని స్టేషన్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సబ్సిడీపై రుణాల మంజూరుపై స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ చేతివృత్తులు, భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేశంలో చేతివృత్తుల మీద ఆధారపడి జీవనం సాగించే కుటుంబాల కోసం రూ.13 వేల కోట్లతో పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకం, ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు, పేదలకు ఇళ్లు, ఆహారభద్రత కల్పించిందని, అలాగే స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా రాష్ట్రంలో అన్ని పట్టణాలు, గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించిందని, రైతులకు చేయూత, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, అసంఘటిత రంగ కార్మికుల కోసం ఈ శ్రమ్ ద్వారా ఆర్థిక భద్రత కల్పించడం, గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు వంటి సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పోస్టర్‌ను ప్రజాప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, వికసిత్ భారత్ కార్యక్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడిపశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ సింహాద్రప్పడు

కోటవురట్ల : పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు ఉత్తమ సేవలు అందుతున్నాయని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. పాములవాక పశు సంవర్ధశాఖ పరిధి రామన్నపాలెంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ చిన అప్పన్న శిబిరాన్ని ప్రారంభించగా పశువైద్యాధికారులు పాడి పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స అందించారు. అనంతరం సర్పంచ్ చిన అప్పన్ననుు ఏడీ సింహాద్రప్పడు సత్కరించారు. డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ ఈ శిబిరంలో ఎదకు రాని 66 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 17 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, అనారోగ్యంతో ఉన్న పది పశువులకు చికిత్స అందించినట్టు తెలిపారు. శిబిరంలో పశు వైద్యాధికారులు డా.ప్రతాప్, డా.బాబూరావు పడాల్, డా.శిరీష, పారా వెట్స్, పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థ మహోత్సవం



మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం



పైడితల్లమ్మ తీర్థ మహోత్సవంలో జనసందోహం

రాంబిల్లి : మామిడివాడ గ్రామంలో గురువారం పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భారీగా తీర్థ మహోత్సవం జరిగింది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనంతో ప్రాంగణం నిండిపోయింది. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగుల రాట్నాలు ఎక్కేందుకు జనం పోటీ పడ్డారు. కొప్పుగొండుపాలెం, వెంకటాపురం గ్రామాల్లోనూ గురువారం సీతారాముల తీర్థమహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్ల, కోలాటాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా సమతా సంకల్ప మహోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శచీదేవి



మానవహారంగా ఏర్పడి మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి: సామాజిక సమానత్వ యోధుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం సమతా సంకల్ప మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 19న విజయవాడలో రాజ్యాంగాన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. దేశ పరిపాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని చెప్పారు. ప్రపంచదేశాల్లో ఉన్న రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి కొన్ని ముఖ్యమైన అంశాలు సేకరించి రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. భారతదేశంలో అందరికీ సమానహక్కులు కల్పించి, మహిళలకు, పురుషులకు ఓటుహక్కు సమానంగా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతకు ముందు మానవహారంగా ఏర్పడి మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, జెడ్పీ ఎస్.వెంకటరమణ, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ అజయ్‌కుమార్, డీఎస్‌వో రమణ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవరాపల్లికి చెందిన వెత్సా రమేష్ పెట్రోల్ బంక్ నుండి ద్విచక్ర వాహనంపై దేవరాపల్లిలోని తన ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమేష్‌కు కాలు విరిగిపోవడంతో వెంటనే స్థానికులు విశాఖపట్నం తరలించారు. అలాగే రైవాడ నుండి పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న బొబ్బిలి దేముళ్లను కైరోశ్ స్కూల్ వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దేముళ్ల భార్య దేవి తెలిపారు.